సాక్షి
మంచిర్యాల
బుధవారం : 21 : ఫిబ్రవరి : 2024




**కమ్మనైనది.. అమ్మభాష**
తెలుగుభాషలోని మాధుర్యం, గొప్పతనం ఏ భాషలోనూ ఉండదంటే అతిశయోక్తి కాదు. నేడు మాతృభాష దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..
8లో▸

**నరనారాయణస్వామి జాతర**



జన్నారం మండలం కలమడుగు గ్రామంలోని రాష్ట్రంలోని ఏకైక నరనారాయణస్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. ఈ నెల 23నుంచి 26వ తేదీ వరకు ఇక్కడ జాతర నిర్వహించనున్నారు.
8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /21.0

**వాతావరణం**
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు వేడిగా, రాత్రివేళ చలిగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అభ్యంతరాల స్వీకరణ

**మంచిర్యాలటౌన్:** జాతీయ ఆరోగ్యమిషన్ కింద, జిల్లా వైద్యారోగ్యశాఖ మంచిర్యాల పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల ఖాళీల భర్తీకి అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం, మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.mancherial.telangana.gov.in లో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే ఈ నెల 21నుంచి 23వ తేదీ వరకు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో తెలుపాలని సూచించారు.

### లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు చేయాలి



లెక్కింపు ఏర్పాట్లు సమీక్షిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ మోతీలాల్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేసి.. లెక్కింపు ప్రక్రియ చేపట్టేందుకు కేంద్రాన్ని సిద్ధం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలు, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు కేంద్రం వద్ద తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. స్టాటికల్ సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో టీం, అకౌంటింగ్ టీంతో పాటు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, సెక్టోరియల్ అధికారులు, సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన**
**మంచిర్యాలఅగ్రికల్చర్:** సమీకృత కలెక్టర్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బీ సంతోష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.


**జాతర ఘనంగా నిర్వహించాలి**
**మంచిర్యాలఅగ్రికల్చర్:** ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు సమ్మక్క–సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో డీఈవో ఎస్.యాదయ్యతో కలిసి జాతర ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. జాతరలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా గ్రీన్‌కోర్ సమన్వయకర్త యోగేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాలఅగ్రికల్చర్:** టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ సూచించారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో డీఈవో యాదయ్య, ఏసీపీ ప్రకాశ్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజతో కలిసి విద్యాశాఖ అధికారులతో 10వ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 28నుంచి మార్చి 16వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో 5,455 మంది (జనరల్), 1,106 మంది (ఒకేషనల్), ద్వితీయ సంవత్సరంలో 5,975 మంది (జనరల్), 1,160 మంది (ఒకేషనల్) విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో తగిన వసతులు కల్పించాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహిస్తారని, జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 9,645 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ శరత్‌కుమార్, పీ నగేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అమాత్యుడెవరో!

- మొదటికూర్పులో ప్రాతినిధ్యం నిల్
- త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ..?
- ఉమ్మడి జిల్లాను ఊరిస్తున్న పదవి
- ఆశావహుల్లో పీఎస్సార్, గడ్డం బ్రదర్స్
- ఎవరికివారే అధిష్టానం వద్ద యత్నం




**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** రాష్ట్ర మంత్రి వర్గంలో మన ఎమ్మెల్యేల్లో ఎవరికి చోటు దక్కుతుందనే ఉత్కంఠ వీడడం లేదు. రాష్ట్రంలో తొలి మంత్రివర్గ కూర్పులో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ అవకాశం దక్కలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే మంత్రివర్గ విస్తరణ చేపడతారని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ క్రమంలో ఎవరికి కేబినెట్‌లో బెర్త్ దక్కుతుందనే ఆసక్తి అధికార పార్టీతో పాటు ప్రజల్లోనూ ఉంది. ఉమ్మడి జిల్లాలో 10 స్థానాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఖానాపూర్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. పార్టీలో సీనియర్ నాయకుడు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు మొదటి కూర్పులోనే కేబినెట్‌లో చోటు దక్కుతుందనే ప్రచారం జరిగినా అవకాశం రాలేదు. ఇక గడ్డం సోదరులైన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కూడా అమాత్య పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరి ముగ్గురి మధ్య పోటీ నెలకొంది.

**అన్నదమ్ముల్లోనే పోటీ**
మాజీ మంత్రి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఇద్దరూ అన్నదమ్ములు. వీరిరువురూ మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. 2004నుంచి 2009 మధ్య చెన్నూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంత్రిగా పనిచేశానని, తనకే మళ్లీ అవకాశం ఇవ్వాలని వినోద్ కోరుతున్నారు. ఇందుకోసం రెండునెలల క్రితమే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కలిసి విన్నవించారు. ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డిని తరచూ కలుస్తున్నారు. గడ్డం వివేక్ కూడా మంత్రి పదవిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇద్దరూ పదవిపై పోటీ పడుతూ ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు.

**వంశీ ఎంపీ టికెట్‌తో లింకు?**
లోక్ సభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి బరిలో దిగాలని వివేక్ తనయుడు వంశీకృష్ణ అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు, ఒకరికి ఎంపీ టికెట్, మళ్లీ అదే కుటుంబం నుంచి మంత్రి పదవి కూడా ఇస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే కోణంలో పరిశీలన చేస్తున్నట్లు నాయకులు చెప్పుకొంటున్నారు. ఇక వంశీకి లోక్‌సభ టికెట్ కావాలని అడుగుతున్న క్రమంలో టికెట్ ఇస్తే, మంత్రి పదవి వదులుకుంటారా? లేక టికెట్‌తో పాటు కేబినెట్‌లో చోటు కోసం పట్టుబడుతారా? అనేది తేలాల్సి ఉంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలయ్యే దాకా ఈ సమస్య తేల్చ కుండా, మంత్రివర్గ విస్తరణ వాయిదా వేసే అవకాశం ఉందని కొందరు నాయకులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పాలన పరంగా ఇబ్బంది లేకుండా, స్థానికంగా మంత్రి ఎవరూ లేకపోవడంతో ఆ స్థానంలో మంత్రి సీతక్కను ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆమెతోనే పాలన కొనసాగిస్తారా? లేక ఇక్కడి ఎమ్మెల్యేల్లో ఎవరికైనా అవకాశం కల్పిస్తారా?.. అనే విషయం తేలేవరకూ వేచిచూడాల్సిందే.

**'పీఎస్సార్'కు పెద్దల హామీ!**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పదేళ్లుగా కాంగ్రెస్ అధికారంలో లేకున్నా పార్టీని బలోపేతం చేశారనే మంచి పేరు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు ఉంది. కష్టకాలంలో పార్టీలో కేడర్‌ను కాపాడినట్లు చెప్పుకొంటారు. ఆ సమయంలో గడ్డం సోదరులు ఇంకా కాంగ్రెస్‌లో చేరలేదు. రెండేళ్ల క్రితం బీఎస్పీ నుంచి వినోద్, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు వివేక్ కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. వీళ్లిద్దరి కంటే పార్టీలో సీనియర్‌గా ఉండి, పార్టీ కోసం కష్టపడ్డారని, పీఎస్సార్‌కే మంత్రి పదవి ఇవ్వాలని ఆయన వర్గీయులు పట్టుబడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'దళిత గిరిజన దండోరా' బహిరంగ సభ సక్సెస్ చేసి పార్టీలో ఉత్తేజం నింపారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన 'హాత్ సే హాత్ జోడో యాత్ర'ను సక్సెస్ చేశారు. మంచిర్యాలలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభ వేదికపైనే పీఎస్సార్ వచ్చే ప్రభుత్వంలో మంచిహోదాలో ఉంటారని హామీ ఇచ్చారు. తర్వాత పార్టీ ఎన్నికల వ్యూహ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఈ క్రమంలో ఆయన కూడా గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

### భయం వీడి పరీక్షలు రాయాలి

**మంచిర్యాలఅర్బన్:** భయం వీడి పరీక్షలు రాయాలని డీఈవో యాదయ్య సూచించారు. మంగళవారం స్థానిక మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో హజీపూర్, నస్పూర్ మండలాలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మండలంలో సైకాలజిస్ట్, సబ్జెక్ట్ నిపుణుడితో ప్రేరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సైకాలజిస్ట్ శ్రీహరి మాట్లాడుతూ.. ఈ నెలరోజులు కీలకమని, పక్కా ప్రణాళికతో సిద్ధమైతే వందశాతం ఫలితాలు సాధ్యమన్నారు. మున్సిపల్ కమిషనర్ సతీశ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, డీసీఈబీ సెక్రటరీ భీంరావ్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ కుమారస్వామి, వివిధ పాఠశాలల సబ్జెక్ట్ నిపుణులు తదితరులున్నారు.

# రజాకార్లపై తిరగబడిన గడ్డ..



అసోం సీఎం హిమంత బిశ్వశర్మకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

- భీం స్ఫూర్తితో ముందుకుసాగాలి
- తీస్‌రీ బార్.. మోదీ సర్కార్..
- భైంసా సభలో అసోం సీఎం హిమంత బిశ్వశర్మ
- బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు..: కె.లక్ష్మణ్
- నిర్మల్‌లో ప్రారంభమైన బీజేపీ విజయసంకల్పయాత్ర

**నిర్మల్/భైంసా/భైంసాటౌన్:** 'నా ప్రియమైన భైంసా సోదర సోదరీమణులారా.. మీ అందరికీ నమస్కారాలు..' అంటూ అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టి ఆకట్టుకున్నారు. స్వతంత్రకాలంలోనే రజాకార్లతో పోరాడిన గడ్డ ఇది. ఇప్పటికీ రజాకార్లు ఉన్నారు. ప్రజలు కుమురంభీం పక్షాన నిలిచి వారిపై పోరాడాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన కుమురంభీం క్లస్టర్ విజయసంకల్ప యాత్రను మణిపూర్ మంత్రి సుసింద్రోమెయితీతో కలిసి మంగళవారం భైంసాలో ప్రారంభించారు. అంతకుముందు బాసర సరస్వతీమాత ఆలయం వద్ద యాత్ర వాహనాలకు పూజలు నిర్వహించారు.

**ఐదు శతాబ్దాల కల నెరవేరింది..**
అయోధ్యలో రామమందిర నిర్మాణం ఐదు శతాబ్దాల కల నెరవేరిందని బిశ్వశర్మ అన్నారు. మందిర నిర్మాణంతో దేశమంతా ఉత్సాహకర వాతావరణం నెలకొందన్నారు. తెలంగాణలో బీజేపీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలవడం శుభపరిణామమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో 80 సీట్లు గెలిచి సర్కారు ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంజేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ అబద్ధాలే చెబుతోందని ఆరోపించారు. ఒక్క పథకాన్నీ అమలు చేయడం లేదని విమర్శించారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే మనదేశం ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఎదుగుతుందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో బీజేపీని గెలిపించాలని కోరారు. తనలాగే నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చారన్న విషయం తెలుసుకున్నానన్నారు. బీజేపీలోకి వచ్చిన తర్వాత ఆయన ఎమ్మెల్యేగా గెలిచారని, ఇప్పుడు బీజేఎల్పీ నేత కూడా అయ్యారని చెప్పారు. తాను కాంగ్రెస్‌ను వదిలి బీజేపీలోకి వచ్చిన తర్వాత బీజేఎల్పీగా ఉన్నానని, తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రిని అయ్యానని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలవి కుటుంబ, అవినీతి పాలన అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. ప్రపంచ దేశాలు మోదీని నాయకత్వాన్ని ప్రశంసిస్తున్నాయని, కాంగ్రెస్ నాయకులు మాత్రం ఆయన కులాన్ని, వృత్తిని అవమానపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. దేశ రక్షణ కోసం మోదీ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. పదేళ్ల కాలంలో ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా పాలన చేస్తున్నారన్నారు. మోదీ సామాన్యవ్యక్తి కాదని, కారణజన్ముడని కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, పార్లమెంట్ ప్రభరీ అల్జాపూర్ శ్రీనివాస్, కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, బస్‌యాత్ర ప్రముఖ్ రావుల రాంనాథ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, ఇతర పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనదేవతలకు నీరాజనం

- నేడు సారలమ్మ గద్దెకు రాక
- రేపు సమ్మక్క తల్లి ఆగమనం
- అధికసంఖ్యలో వస్తున్న భక్తులు
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి
- 24వరకు కొనసాగనున్న జాతర




మంచిర్యాల గోదావరి తీరాన ముస్తాబైన గద్దెలు

వనదేవతలైన సమ్మక్క–సారలమ్మలు గద్దెలపై కొలువుదీరే గడియలు ఆసన్నమయ్యాయి. ఇపుడు ఏ దారి చూసినా సమ్మక్క–సారలమ్మ జాతర వైపే సాగుతున్నాయి. నేడు సారలమ్మ ఆగమనంతో జాతర ప్రారంభం కానుంది. గురువారం సమ్మక్క గద్దెపై కొలువుదీరనుంది. భక్తకోటి పూజలందుకున్నాక అమ్మవార్లు తిరిగి శనివారం వనప్రవేశం చేస్తారు. ఈ అపురూప ఘట్టాలు చూసి తరించేందుకు భక్తజనం ఇప్పటికే జాతర ప్రాంగణాలకు చేరుకుంటున్నారు. జిల్లాలో గోదావరి తీరంతోపాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్న జాతరలకు నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

**మంచిర్యాలఅర్బన్:** మంచిర్యాల గోదావరి తీరంలో సమ్మక్క–సారలమ్మ జాతరకు సర్వం సిద్ధం చేశారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతర నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఇక్కడ నిర్వహించే జాతరకు మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్‌తోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో రానున్నారు. ఇప్పటికే జాతర ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల స్నానాల కోసం షవర్లు, తాగునీటి కోసం కుళాయిలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు నిర్మించారు. చిరువ్యాపారులు జాతరలో వివిధ దుకాణాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు చొరవతో మున్సిపల్ ఈవో ముక్తా రవి, కమిషనర్ మారుతీప్రసాద్ తదితరులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వాహనాలు నిలిపేందుకు సరస్వతి శిశుమందిర్‌కు సమీపాన, ఎదురుగా ఉన్న మాతాశిశు ఆస్పత్రి ఖాళీస్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు.

**నేటి నుంచి జాతర ప్రారంభం**
బుధవారం జాతర ప్రారంభం కానుంది. మేడారానికి చెందిన గిరిజన పూజారి కృష్ణయ్య దొర ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో సమీపంలోని కన్నెపల్లిగా పిలిచే ఇల్లారి (తల్లుల గుడి) నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించనున్నారు. సారలమ్మతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్నతో గద్దెపైకి చేరుకోనున్నారు. గురువారం సమ్మక్క గద్దెపైకి చేరుకోనుంది.

**భారీ బందోబస్తు ఏర్పాటు**
జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా డీసీపీ, ఏసీపీతో పాటు నలుగురు సీఐలు, 15మంది ఎస్సైలు, 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. సీపీ శ్రీనివాస్ జాతర ప్రాంతాన్ని పరిశీలించారు. రెండు నిఘా (మఫ్టీ) బృందాలు, షీటీంతో పాటు 25 సీసీ కెమెరాల నిఘా నీడలో జాతర సాగనుంది. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఎన్‌సీసీ, స్వచ్ఛంధ సంస్థ సభ్యుల సేవలను వినియోగించుకోనున్నారు.

**ఇరువైపులా జాతర**
గోదావరి నదికి రెండు వైపులా జాతర సాగనుంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడ వైపు.. మంచిర్యాల నది తీరాన సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించనున్నారు. అంతకుముందు మంచిర్యాల ప్రాంతం భక్తులు గోదావరి నది దాటి వెళ్లి గోలివాడ సమ్మక్క–సారలమ్మకు మొక్కుతీర్చుకునేవారు. అప్పట్లో గోదావరి దాటుతున్న క్రమంలో నీటి ప్రవాహంలో మునిగిపోయి భక్తులు మృత్యువాత పడటంతో 22 ఏళ్ల కిందట మంచిర్యాల గోదావరి నది తీరాన వనదేవతల జాతరను ప్రారంభించారు. అప్పటినుంచి మంచిర్యాల గోదావరినది తీరాన అమ్మవార్ల జాతర కొనసాగుతోంది. నాలుగేళ్ల కిందట కాళేశ్వరం బ్యాక్‌వాటర్‌తో నిండుగా గోదావరి ఉండటంతో దాతలు స్థలం కేటాయించారు. దీంతో గోదావరి ఒడ్డున ప్రత్యేకంగా జాతర సాగుతుంది. మరోవైపు నీటి ప్రవాహంతో గోలివాడ జాతరకు వెళ్లేందుకు భక్తులకు వీలుకాకుండా పోయింది. ఈ ఏడాది నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో భక్తులు గోదావరిలో తాత్కాలిక అవాసాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు గోలివాడ వైపు కూడా వెళ్లే అవకాశముంది. కానీ.. గోదావరి నది దాటే క్రమంలో భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

### ఇటిక్యాల గోదావరినది తీరాన..



ముస్తాబైన గద్దెలు

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామ గోదావరినది తీరాన సమ్మక్క–సారలమ్మ జాతరను 2016లో ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఐదెకరాల ప్రభుత్వ భూమి కేటాయించగా కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వరకు రోడ్డు వేశారు. వనదేవతల గద్దెలను గ్రామానికి చెందిన కానిగంటి మల్లయ్య రూ.లక్షన్నర సొంత డబ్బులతో నిర్మించారు. సురేందర్‌రెడ్డి విద్యుద్దీపాలను విరాళంగా ఇచ్చారు. ఈసారి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు రూ.25 లక్షలు సమ్మక్క–సారలమ్మ ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేయించారు. ఇక్కడికి సుమారు 30వేల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. మేడారం కోయ పూజారుల పర్యవేక్షణలో జాతర కొనసాగనుండగా కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

### కార్మిక క్షేత్రం సీసీసీలో..



ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ముస్తాబైన గద్దెలు

**నస్పూర్:** కార్మిక క్షేత్రంలోని సీసీసీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద సింగరేణి ఆధ్వర్యంలో సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి ఈనెల 24వ తేదీ వరకు జాతర జరగనుంది. పట్టణ పరిధిలోని సీసీసీ నస్పూర్, శ్రీరాంపూర్ ఏరియాలోని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వనదేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. సింగరేణి యాజమాన్యం సుమారు 25 ఏళ్ల క్రితం ఇక్కడ జాతర ప్రారంభించింది. కోయ పూజారుల పర్యవేక్షణలో జాతర కొనసాగనుంది.

### సుబ్బరాంపల్లిలో..



సుబ్బరాంపల్లిలో..

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలో సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కిష్టంపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై కూడా జాతర నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్న జాతర కోసం సమ్మక్క, సారలమ్మ గద్దెలను ముస్తాబు చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు ఇక్కడ బోనాలు పోస్తారు. మేకలు, కోళ్ల బలి ఇచ్చి మొక్కు తీర్చుకుంటారు.

### బతుకమ్మవాగు బ్రిడ్జి సమీపంలో..



ముస్తాబైన గద్దెలు

**చెన్నూర్:** చెన్నూర్ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన బతుకమ్మ వాగు బ్రిడ్జి సమీపంలో సమ్మక్క–సారలమ్మ జాతరకు గిరిజన పూజారులు గద్దెలను ముస్తాబు చేస్తున్నారు. బుధ, గురువారాల్లో జరిగే జాతరకు పట్టణంతో పాటు మండలంలోని అక్కెపల్లి, చింతలపల్లి, శివలింగాపూర్ గ్రామస్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తారు. బుధవారం అక్కెపల్లికి చెందిన గిరిజన పూజారులు అటవీ ప్రాంతం నుంచి కంకవనాన్ని తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమవుతుంది.

### పాలవాగు తీరాన..



పాలవాగు ఒడ్డున..

**రామకృష్ణాపూర్:** ఆర్కే1ఏ గని సమీప పాలవాగు ఒడ్డున సమ్మక్క–సారలమ్మ జాతరకు సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతర ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. తాత్కాలిక రోడ్లు నిర్మించారు. అన్ని వసతులు కల్పించారు. జాతర ప్రాంగణమంతా సీసీ కెమెరాలు అమర్చారు. మందమర్రిలోని దూలం కనకయ్య ఇంటి నుంచి అమ్మవార్లను జాతర ప్రాంగణానికి ఊరేగింపుగా తరలించనున్నారు. జాతర ఏర్పాట్లను మందమర్రి జీఎం మనోహర్ మంగళవారం పరిశీలించారు.

## క్లుప్తంగా

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సాబీర్‌అలీ (ఫైల్)

తాండూర్(బెల్లంపల్లి): అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూర్‌లో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్‌కు చెందిన షేక్ సాబీర్ అలీ(49) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెలరోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. మంగళవారం గ్రామంలోని గెస్ట్‌హౌస్ వెనకాల ఉన్న కుంటలో మృతదేహం కనిపించడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### రైలు కిందపడి మహిళ మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ వెనకాల గల రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతురాలి వయస్సు 40 సంవత్సరాల వయసు ఉంటుందని, పసుపు రంగు జాకెట్, పసుపురంగు చీర ధరించి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామని, తెలిసినవారు 9948481902 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

### ఎదురెదురుగా రెండు లారీలు ఢీ


ఘటన స్థలంలో రోడ్డుపై లారీలు

వాంకిడి(ఆసిఫాబాద్): ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్న సంఘటన మంగళవారం గణేశ్‌పూర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాంద్ పాషా ఉదయం 6 గంటలకు తన మినీ లారీలో పత్తి లోడ్‌చేసి డ్రైవర్ తారాచంద్‌తో చంద్రాపూర్‌కు తరలిస్తుండగా గణేశ్‌పూర్ సమీపంలో నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై గల బ్రిడ్జి వద్ద మహారాష్ట్ర నుంచి వాంకిడి వైపు వస్తున్న ఐచర్ లారీ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టింది. లారీ బోల్తా పడడంతో డ్రైవర్ తారాచంద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఐచర్ డ్రైవర్ చెన్నూర్‌కు చెందిన లావుడ్య గంగాధర్‌గా గుర్తించారు. చాంద్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నిర్మిస్తున్న ఎకో బ్రిడ్జి పనులు కొనసాగుతుండటంతో అటు నుంచి వచ్చే వాహనాలు గోయేగాం వరకు రాంగ్‌రూట్‌లో రావాల్సి ఉంటుంది. యూటర్న్ వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు దృష్టి సారించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# కమ్మనైనది.. అమ్మభాష

‘దేశ భాషలందు తెలుగు లెస్స’.. అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పతనం ఇక ఏ భాషలోనూ లేదని చాలామంది కవులు చెప్పారు. నేటి ప్రపంచంలో దేశాల మధ్య, దేశప్రజల మధ్య సంబంధాలు ఎంత పెరిగాయో తెలిసిందే. రకరకాల పనుల కోసం ఒక దేశం నుంచి మరొక దేశానికి వెళ్లడం సాధారణంగా మారింది. అందుకే ఇంగ్లిష్ అంతర్జాతీయ భాషగా ఆమోదం పొందింది. మన భాషను, సంస్కృతిని కాపాడుకోవడం, భావితరాలవారికి దీన్ని అందిస్తూ ఆ భాషా సౌందర్య సంపదను కాపాడటం మనందరి కర్తవ్యం.

- భావప్రకటనకు మాతృభాషే కీలకం
- తొలిపలుకులు నేర్చేది అమ్మభాషలోనే
- కాపాడుకుంటేనే భాషకు మనుగడ
- నేడు మాతృభాషా దినోత్సవం



నిర్మల్‌ఖిల్లా: మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలిబడి. పుట్టిన ప్రతీబిడ్డ నోటి నుండి అప్రయత్నంగా వెలువడే తొలిపలుకు అమ్మా.. అందుకే అది అమ్మ భాష.. మాతృభాష సహజంగా అలవడుతుంది. మనిషి తన భావాలను వ్యక్తపరిచే ఒక సాధనం భాష. భూమిపై ఉన్న అన్ని జీవరాశుల్లో మానవుడు ఒక్కడే తన భావాలను మాటల రూపంలో వ్యక్తం చేయగలడు. జీవన మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మాతృభాషను పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఏటా ఫిబ్రవరి 21న నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

**అమ్మ ఒడిలో...**

మనిషి పుట్టగానే తల్లి ఒడిలో నేర్చుకునే పదాలే మాతృభాష. అవి మనిషికి ఎంతో విలువైనవి. అమ్మ పలుకులోని ఆప్యాయత అనురాగం మరెక్కడా దొరకవు. మనిషి తాను ప్రపంచంలో అన్ని చోట్ల జయించాలంటే తన మాతృభాషను గౌరవించాలి. మనస్సులోని భావాలను సహజంగా వ్యక్తం చేయగల శక్తి మాతృభాషకే ఉంది. అయితే నేడు మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ పరభాషల వెంట పరుగులు తీస్తున్నారు. ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే కానీ ఆ వంకతో మాతృభాషను చిన్న చూపు చూడకూడదని జిల్లాకు చెందిన పలువురు తెలుగు సాహితీ వేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పలుకుబడుల భాష కాదు.. బడిపలుకుల భాష కావలె'' అని తెలంగాణ కవి కాళోజీ నినదించారు.

**ఆరువేల భాషలు...**

ప్రపంచంలో మొత్తం ఆరువేల భాషలు ఉండగా, భారత దేశంలో 1,652 మాతృభాషలున్నాయి. వీటిలో 16 భాషలకు మాత్రమే లిపి ఉంది. 200 భాషలకు 1600 పైగా మాండలికాలున్నాయి. మాతృభాష అంతరించిపోయే ప్రమాదాన్ని పసిగట్టిన యునెస్కో ప్రజల జాతీయ, పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక హక్కుల్లో మాతృభాష అంతర్భాగమని నిర్వచించింది. మన దేశంలో 57 అక్షరాలు, 3 ఉభయ అక్షరాలు ఉన్న తెలుగుభాష ప్రపంచ భాషల్లోనే రెండో అతి పెద్ద మాతృభాషగా మన్ననలు పొందుతోంది. హిందీ తరువాత తెలుగు మాట్లాడే వారు ఎక్కువగా ఉన్నారు.

**ఇదీ నేపథ్యం...**

2000 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది మాతృభాష పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తోంది. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో అంటోంది. అందరికీ ఈక్విటీ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. 2002 నాటి ఐక్యరాజ్యసమితి తీర్మానంపై యూఎన్ జనరల్ అసెంబ్లీ యూఎన్ దినోత్సవ ప్రకటనకు మద్దతు ఇచ్చింది.

**మనదగ్గర మాతృభాషాభిమానులు..**

నిర్మల్ జిల్లా అనగానే మాతృభాష అయిన తెలుగు ఔన్నత్యాన్ని చాటే కవులు, కళాకారులు గుర్తొస్తారు. జిల్లా చరిత్రలో ఆది నుంచి సాహితీ సౌరభాలు విరబూస్తున్నాయి. జిల్లాలో తొలితరం కవుల నుండి మొదలుకొని ప్రస్తుతం ఉన్న పద్యకవులు, వచన కవులు, కళాకారులు సాహితీవేత్తల వరకు కొదవలేదు. ఈ వారసత్వాన్ని పునికి పుచ్చుకొని వర్తమాన కవులు, కళాకారులు సైతం ఇదేమార్గంలో పయనిస్తున్నారు.

**జిల్లా కవులు...**

జిల్లా నుంచి ప్రస్తుతం బొందిడి పురుషోత్తం, నేరెళ్ల హన్మంతు, వెంకట్, చక్రధరి, దామెర రాములు, పత్తి శివప్రసాద్, కరిపె రాజ్‌కుమార్, పుండలిక్‌రావు, తుమ్మల దేవరావు, అంబటి నారాయణ, పోలీస్ భీమేష్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, అబ్బడి రాజేశ్వర్ రెడ్డి తదితర కవులు, రచయితలు మాతృభాషలో తమ రచనలతో సామాజిక చైతన్య ప్రతీకలుగా కొనసాగుతున్నారు.

**ఇంటి నుంచే తొలి అడుగుపడాలి**



మాతృభాష అభిమానం అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు తెలుగు భాషను, వారి మాతృభాషను ప్రోత్సహించాలి. తమ పిల్లలకు తెలుగు నేర్పడం చిన్నతనంగా భావించకూడదు. కనీసం పాఠశాల విద్య వరకు తెలుగు తప్పనిసరిగా చేసి పోటీ పరీక్షల్లో ప్రోత్సాహక మార్కులు ఇవ్వాలి. పర భాషల మోజులో మాతృభాషను మరువొద్దు.

– టీకులపెల్లి నరసయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, నిర్మల్

**అమ్మ భాషే కమ్మనైనది..**



మాతృభాషలో విద్యా బోధన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. మాతృభాష తెలుగు కమ్మనైనది. బిడ్డకు అమ్మపలుకే కమ్మగా ఉంటుంది. అందుకే అమ్మభాష తీయగా ఉంటుంది. మీ మాతృభాషలోని పదనిసలు, భాషా సౌందర్యం చిన్నతనం నుండే పరిచయం చేయాలి. మాతృభాషకు చెందిన కథల పుస్తకాలు, నవలలు వంటి వాటిని చదవడాన్ని ప్రోత్సహించాలి.

– టి.సంపత్‌కుమార్, తెలుగు సాహితీవేత్త, నవలా రచయిత, నిర్మల్

**మాతృభాషను మరువొద్దు**



చిన్నప్పటి నుంచి అమ్మనేర్పిన మాతృభాష తెలుగు కాబట్టి దీనిని మరువొద్దు. తెలుగులో మాట్లాడడానికి చాలామంది నామోషీగా భావిస్తున్నారు. సమాజంలో చాలామంది ఆంగ్లభాషను మాట్లాడుతూ.. మాతృభాష పట్ల వివక్ష చూపుతున్నారు. అది సరికాదు. ప్రస్తుతం ఎదుగుతున్న యువతరానికి కూడా తెలుగు పట్ల అభిరుచిని పెంపొందించాలి.

– పత్తి శివప్రసాద్, టీవీ వ్యాఖ్యాత, రచయిత, నిర్మల్

### కంకవనం ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న అధికారులు, నాయకులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): ఆర్‌కే1ఏ గని సమీపంలోని పాలవాగు ఒడ్డున నిర్వహిస్తున్న జాతరలో భాగంగా మంగళవారం కంకవనం ప్రతిష్ఠించారు. డప్పుచప్పుల్ల మధ్య కంకవనం తీసుకువచ్చి జాతర ప్రాంగణంలోని సమ్మక్క, సారలమ్మ, పైడిగిద్దెరాజు గద్దెలపై ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం మనోహర్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించనున్న జాతరలో కార్మికులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఆర్‌కే1ఏ గని మేనేజర్ జయంత్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### విదేశీ విద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు సంబంధించి విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేట్ /డాక్టోరల్ కోర్సులను చదివేందుకు స్కాలర్‌షిప్/ఫైనాన్షియల్ అసిస్టెన్స్ మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఆగస్టు 1, 2023 నుంచి డిసెంబర్ 31, 2023 మధ్యకాలంలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా మార్చి 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భీమారం(చెన్నూర్): జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లోని లాలాగూడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాదం రవీందర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని కార్యదర్శి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, పీఈటీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై రాజయ్య

లక్సెట్టిపేట: ఈ నెల 16న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పాలమాకుల నారాయణ (70) ఈ నెల 16న మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. అనంతరం పొలం వద్దకు వెళ్లి అక్కడే పడుకున్నాడు. మరుసటిరోజు ఇంటికి వచ్చేసరికి అతని భార్య బాధపడుతుండడం గమనించి మనస్తాపానికి గురయ్యాడు. మళ్లీ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. విషయం కుమారులకు తెలియడంతో మంచిర్యాలలోని ప్రైవేట్ తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ‘గెలిచిన సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వాలి’



మాట్లాడుతున్న మల్రాజు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన సంఘానికి డెప్యూటీ లేబర్ కమిషనర్ వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైనా ఇప్పటి వరకు ఆ సంఘానికి గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్పొరేట్, ఏరియా స్థాయిలో గుర్తింపుసంఘం నిర్మాణాత్మక సమావేశాలు జరపాల్సి ఉంటుందన్నారు. అందులో కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత గుర్తింపు సంఘంపై ఉంటుందన్నారు. సమావేశంలో ఏరియా నాయకులు సమ్మయ్య, ఓరం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

### బాలుడు అదృశ్యం


అదృశ్యమైన బాలుడు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని మొదటి జోన్ శిశుమందిర్ ఏరియాకు చెందిన రేగుల మణి అలియాస్ శివమణి (17) సోమవారం మధ్యాహ్నం అదృశ్యమయ్యాడు. బాలుడి తల్లి సరిత ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

### ముగిసిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ సెంటర్‌లో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ టీచర్స్, బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ ముగిసింది. జెడ్పీహెచ్‌ఎస్ బజార్ ఏరియా బెల్లంపల్లికి చెందిన సుకాంత్ (ప్రథమ), జన్నారం మండలం కలమడుగు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన అశ్వక్ (ద్వితీయ), తాండూర్ మండలం అచ్చలపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన జశ్వంత్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, ఫోరమ్ ఉపాధ్యాయులు పద్మవనమాల, వెంకటేశ్వరరావు, మూర్తి, విద్యాసాగర్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

### ‘విజయ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి’

మంచిర్యాలటౌన్: ఈ నెల 23న జిల్లాలో ప్రారంభం కానున్న బీజేపీ విజయ సంకల్పయాత్ర విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి తులా ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23న తాండూర్‌లో యాత్ర ప్రారంభమై 24న ఇందారంలో ముగుస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు చేరవేసేలా విజయ సంకల్ప యాత్ర సాగుతుందన్నారు. సమావేశంలో ఆకుల అశోక్, బండి మల్లికార్జున్, బోయిని హరికృష్ణ, ప్రభాకర్‌రావు, బొద్దుల మల్లేశ్, ముదాం మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

### హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో వ్యక్తిని హత్య చేసిన కేసులో సిర్పూర్(యూ) మండలం ధనోర గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు సెడ్మెకి నాందేవ్(51), సెడ్మెకి భీమ్‌రావులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.4 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై సాగర్, ఆసిఫాబాద్ సబ్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం .. ధనోరా గ్రామానికి చెందిన సెడ్మెకి తుకారాం మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అదే గ్రామానికి చెందిన సెడ్మెకి నాందేవ్, సెడ్మెకి భీమ్‌రావు కర్రలతో దాడి చేసి హత మార్చారు. మృతుని కుమారుడు అంబాజీ ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. జైనూర్ ప్రస్తుత సీఐ అంజయ్య, ఎస్సై రాజుతో పాటు పోలీసులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేశ్ కుమార్ ఈ సందర్భంగా అభినందించారు.

### ప్రజాదర్బార్‌లో కాంట్రాక్ట్ కార్మికుల వినతి


హాజరైన కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రజాదర్బార్ కార్యక్రమానికి హాజరై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కోలిండియా మాదిరి వేతనాలు చెల్లించాలని, బోనస్ అమలు చేయాలని, లాభాల్లో వాటా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.శంకర్, సుధాకర్, ఈశ్వర్, త్రిమూర్తులు, శేఖర్, బాపు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

### 108 వాహనం తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

భీమిని: రాష్ట్ర క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిషోర్ మంగళవారం మండల కేంద్రంలో 108 వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలోని ప్రాథమిక చికిత్స పరికరాలు, మెడికల్ కిట్లు, రికార్డులు పరిశీలించారు. మరింత మెరుగ్గా స్పందించి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పైలెట్ శ్రీనివాస్, ఈఎండీ పాషా, తదితరులు పాల్గొన్నారు.

## నరనారాయణస్వామి జాతర

- 23 నుంచి ప్రారంభం
- ముస్తాబైన ఆలయం


ముస్తాబైన నరనారాయణస్వామి ఆలయం

జన్నారం(ఖానాపూర్): దేశంలోనే రెండోది, రాష్ట్రంలో ఏకైక నరనారాయణస్వామి ఆలయం జాతరకు జాతరకు ముస్తాబైంది. జన్నారం మండలంలోని కలమడుగు గోదావరితీరంలో కాకతీయుల కాలంలో వెలిసిన శ్రీ నరనారాయణస్వామి ఆలయం 39వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 23 నుంచి 26 వరకు జాతర నిర్వహించనున్నారు. గోదావరి తీరాన చోళులు నిర్మించిన ఈ ఆలయంలో నరనారాయణస్వామి (శ్రీ కృష్ణార్జునులు) భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తున్నారు. ఏటా మాఘమాస పౌర్ణమికి మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బద్రినారాయణస్వామి ఆలయం మొదటిది కాగా కలమడుగులోని ఈ ఆలయం రెండవదని గతంలో చిన్నజీయర్‌స్వామి చెప్పినట్లు పురోహితులు తెలిపారు. చోళుల కాలంలో నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో 1986 జూన్ 7న పునర్నిర్మించారు. అప్పటి నుంచి ఏటా జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

**కార్యక్రమాలు ఇలా..**

23న నగర సంకీర్తన, పూర్ణాభిషేకం, వీరాంజనేయ స్వామికి అభిషేకం, నవగ్రహ తైలాభిషేకం, ధర్మధ్వజారోహణ, తులసిపూజ, గోపూజ, విష్ణుసహస్ర నామార్చన, కుంకుమార్చన, 24న శ్రీ కృష్ణ అష్టోత్తర శతనామావళి, సంపూర్ణ గీతహవన హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 25న అభిషేకం, రథోత్సవం, 26న అగ్నిమల్లన్న కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదగిరి స్వదేశ్‌రావు తెలిపారు.

**మహిమగల దేవుడు**



గోదావరి తీరాన వెలిసిన మహిమగల దేవుడు నరనారాయణస్వామి. కొన్ని సంవత్సరాలుగా ఏటా స్వామి వారి జాతర ఘనంగా నిర్వహిస్తున్నాం. బద్రినాథ్ ఆలయం తర్వాత కలమడుగు గోదావరి తీరాన నిర్మితమైంది. స్వయంభువుగా వెలిసిన స్వామి మహిమగల దేవుడు.

– కాకర రాజనరేంద్రశర్మ, ప్రధాన అర్చకులు

**ఏర్పాట్లు పూర్తి చేశాం**



కలమడుగు నరనారాయణ స్వామి జాతరకు ప్రత్యేకత ఉంది. దేశంలో రెండవదిగా ఆలయానికి పేరుంది. జాతర సమయంలో మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– యాదగిరి స్వదేశ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

## ‘నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఈ నెల 25, 26 తేదీల్లో తలపెట్టిన అఖిల భారత విద్యార్థుల సదస్సు విజయవంతం చేయాలని భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య కోరారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు అఖిల భారత విద్యార్థుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, ప్రొఫెసర్లు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ప్రసంగిస్తారన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు సమ్ము రాజయ్య, వడ్డేపల్లి మనోహర్, సోమయ్య, ప్రభాకర్, రాజు, శ్రావణ్, గణేశ్, విక్రమ్, సనత్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలని గద్వాల్ యువతి బైఠాయింపు


భర్త ఇంటి ఎదుట మ్యారేజ్ సర్టిఫికెట్ చూపిస్తున్న సోఫియా

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనకు తెలియకుండా మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని, తనకు న్యాయం చేయాలని గద్వాల్‌కు చెందిన సోఫియా మంగళవారం మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో భర్త ఆసిఫ్ ఇంటి ఎదుట బైఠాయించింది. బాధితురాలి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో ఒకే అపార్టుమెంటు వద్ద నివాసం ఉండే ఆసిఫ్‌తో సోఫియాకు పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమకు దారి తీయగా రెండు మూడు నెలల పాటు ప్రేమించుకున్నారు. సోఫియాను గద్వాల్‌లోని తన ఇంటి నుంచి తీసుకెళ్లి 2015లో వివాహం చేసుకున్నాడు. 2018 వరకు వీరి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసి వెళ్లిపోయాడని బాధితురాలు తెలిపింది. అతనిపై కేసు వేయగా కోర్టులో నడుస్తోందని, గత సంవత్సరం తనకు తెలియకుండా మరో యువతిని పెళ్లి చేసుకున్నాడని సమాచారం అందిందని పేర్కొంది. న్యాయం చేయాలని గోలేటి టౌన్‌షిప్‌లోని భర్త ఇంటి ఎదుట మ్యారేజ్ సర్టిఫికెట్‌తో బైఠాయించింది. రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇరువురి కుటుంబాల పెద్ద మనుషులతో మాట్లాడి బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని ఎస్సై చంద్రశేఖర్ హామీ ఇచ్చినట్లు సమాచారం.